# ఓడిన అవకాశవాదం

- పార్టీ మారినా దక్కని విజయం
- జహీరాబాద్‌లో బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ ఓటమి
- బీఆర్ఎస్ నుంచి గతంలో రెండుసార్లు గెలుపు
- కష్టకాలంలో కేసీఆర్‌ను వదిలి వెళ్లిన ఫలితం



నిజామాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో అవకాశవాద రాజకీయం ఓడింది. పదవీకాంక్షతో చివరి క్షణంలో పార్టీ మారిన ఎంపీ బీబీపాటిల్‌కు ఓటర్లు షాక్ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై రెండుసార్లు ఎంపీగా గెలిచిన పాటిల్ సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్లకు ముందు కండువా మార్చేశారు. హుటాహుటిన ఢిల్లీకి వెళ్లి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కాషాయ కండువా కప్పుకున్న గంటల వ్యవధిలోనే బీజేపీ టికెట్ కూడా ఖాయమైంది. అప్పటి వరకు గులాబీ పార్టీలో ఉంటూ ఆ పార్టీ మీటింగ్‌లో కలగలిసి తిరిగిన సిట్టింగ్ ఎంపీ వెనుకాముందు ఆలోచించకుండానే మరోసారి లోక్‌సభకు వెళ్లాలనే ఏకైక లక్ష్యంతో పార్టీ మారాడు. బీజేపీ ఎంపీ అభ్యర్థిగా 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన పాటిల్.. కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ చేతిలో ఘోరంగా ఓడిపోయారు. పదవి కోసం తనకు రాజకీయ భిక్ష పెట్టిన పార్టీని కాదనుకుని వెళ్లినప్పటికీ విజయం మాత్రం దక్కకపోవడంతో అటు బీబీపాటిల్‌కు, నమ్మి టికెట్ ఇచ్చిన ఇటు బీజేపీ నిరాశే మిగిలింది. అసెంబ్లీ ఎన్నికల్లో 1.8 శాతం ఓట్ల తేడాతో అధికారాన్ని కోల్పోయిన బీఆర్ఎస్‌ను కాదని, తనకు రాజకీయ అవకాశాలను కల్పించిన కేసీఆర్‌ను వదులుకున్న పాటిల్... భవిష్యత్తు రాజకీయ దారి ఎటువైపో అన్నది చర్చనీయాంశమైంది.

**బీజేపీకి అభ్యర్థులు కరువై..**

పారిశ్రామికవేత్తగా పేరొందిన పాటిల్‌ను కేసీఆర్ రాజకీయాల్లోకి తీసుకొచ్చి ప్రోత్సహించారు. 2014లో జహీరాబాద్ అభ్యర్థిగా నిలబెట్టారు. ఓ వైపు వ్యాపారపరంగా, మరోవైపు రాజకీయాల్లో రాణించిన పాటిల్‌కు 2019లోనూ కేసీఆర్ అవకాశం కల్పించారు. ఈ రెండుసార్లు జనం ఆశీర్వదించి లోక్‌సభకు పంపించారు. ఆనాడు అధికార పార్టీలో జహీరాబాద్ టికెట్ కోసం ఎంతో మంది నాయకులు పోటీలో ఉన్నా, సౌమ్యుడు, వివాదరహితుడిగా పేరుందని భావించి కేసీఆర్ పాటిల్‌కు టికెట్ ఇచ్చారు. అయితే, రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోగానే పాటిల్ గోడ దూకేశాడు. ఓటమిపై పశ్చాత్తాపం లేకుండా, విశ్లేషణలు చేయకుండా, కేవలం స్వార్థ అవసరాల రీత్యా కాషాయ శిబిరంలో చేరిపోయాడు. ఇదే అవకాశంగా బీజేపీ పాటిల్‌కు టికెట్ ఖరారు చేసింది. పేరొందిన లీడర్లు లేకపోవడంతో సిట్టింగ్ ఎంపీని చేర్చుకుని బరిలో నిలిపింది. ఇదంతా గమనించిన జహీరాబాద్ ప్రజలు పాటిల్‌ను ఓడగొట్టారు. 2019లో కేవలం 6వేల ఓట్లతోనే గెలవగా ఇప్పుడు భారీ 46 వేల ఓట్లకు పైగా తేడాతో ఓడిపోయారు. 2014లో సురేశ్ షెట్కార్‌ను ఓడించిన పాటిల్ ఇప్పుడు అదే అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు.

**షెట్కార్ రెండోసారి..**

జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం 2009లో ఏర్పడింది. ఆ తర్వాత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన సురేశ్ షెట్కార్ ఇక్కడ విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం 2014లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో సిట్టింగ్ ఎంపీ సురేశ్ షెట్కార్ ఘోర ఓటమి చవిచూశారు. బీఆర్ఎస్ పార్టీ హవాలో హస్తం పార్టీ కొట్టుకు పోయింది. 2019లోనూ ఇదే రకమైన ఫలితం పునరావృతమైంది. అయితే తాజా ఎన్నికల్లో సురేశ్ షెట్కార్‌ను విజయం వరించింది.

## కోటగిరి ప్రభుత్వ కళాశాలలో చేరండి



విద్యార్థుల నుంచి అడ్మిషన్ తీసుకుంటున్న అధ్యాపకులు

కోటగిరి, జూన్ 4: కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కావాల్సి అన్ని రకాల వసతులు, సౌకర్యాలు ఉన్నాయని ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం కళాశాల అధ్యాపకుల బృందం ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థుల నుంచి అడ్మిషన్లు తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన, ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాము, వెంకటేశ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పైప్‌లైన్లకు మరమ్మతు



కమ్మర్‌పల్లిలో మిషన్‌భగీరథ పైప్‌లైన్ వద్ద మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మోర్తాడ్, జూన్ 4: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో మిషన్‌భగీరథ పైప్‌లైన్లకు మరమ్మతు పనులు చేస్తున్నారు. రోడ్డు విస్తరణ పనుల కారణంగా చాలామంది ఇండ్లకు సంబంధించిన నల్లా కనెక్షన్లు తెగిపోయాయి. పనులు నడుస్తున్న సమయంలో తిరిగి మరమ్మతులు చేయకపోవడం కారణంగా మిషన్‌భగీరథ నీళ్లు ఏడాది నుంచి రావడం లేదు. దీంతో అధికారులు నెలరోజులుగా ఈపనులపై ప్రత్యేక దృష్టి సారించారు. కట్ అయిన మెయిన్ పైప్‌లైన్ వద్ద మరమ్మతులు చేయించారు. గ్రామంలో ఇప్పటి వరకు దాదాపు 80నల్లా కనెక్షన్లకు సంబంధించి మరమ్మతులు చేయించారు. ఇంకా ఎక్కడైనా ఉంటే చేయించేందుకు సిద్ధంగా ఉన్నారు. లీకేజీలు బయట పడుతుండడం, నీళ్లు రాని వాళ్లు ఇస్తున్న ఫిర్యాదు మేరకు మరమ్మతు పనులు చేస్తున్నారు. దాదాపు మరమ్మతులు పూర్తి కావడంతో మిషన్‌భగీరథ నీళ్లు కూడా ఇండ్లలోకి సరాఫరా అవుతున్నాయి.

**లీకేజీలు ఉన్న ప్రతిచోటా మరమ్మతులు,**

కమ్మర్‌పల్లిలో మొదట లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేయించాం. తరువాత నీళ్లు రాని వారి ఇండ్ల వద్ద నల్లాలకు సంబంధించిన మరమ్మతు పనులు చేయించాం. ఇప్పటి వరకు దాదాపు 80చోట్లా రూ.2.50లక్షలతో మరమ్మతులు చేయించాం. మరమ్మతులు పూర్తయిన తర్వాత అందరికీ మిషన్‌భగీరథ నీరు సరఫరా చేస్తాం. **- శాంతికుమార్, జీపీ కార్యదర్శి**



## పుష్పాలంకరణ

రామారెడ్డి మండలంలో వెలిసిన కాలభైరవుడికి వైశాఖ మాసం చివరి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సమకూర్చిన పూలతో పుష్పాలంకరణ చేశారు.

*- రామారెడ్డి, జూన్ 4*

## 8న భక్తి కవి సమ్మేళనం

సుభాష్‌నగర్, జూన్ 4: నగరశివారులోని బోర్గాం(పి) లక్ష్మీ గణపతి ఆలయంలో ఈనెల 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న మహా యజ్ఞం పురస్కరించుకొని 8వ తేదీ సాయంత్రం 5 గంటలకు భక్తి కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ వ్యవస్థాపకులు అరుణ్‌కుమార్ శర్మ, సమన్వయకర్త కాసర్ల నరేశ్‌రావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పద్యమైతే ఐదు పద్యాలు, వచనమైతే 24 వరుసలు, గేయమైతే పల్లవి పది వరసలకు మించిన రెండు చరణాలతో ఉండాలని సూచించారు. ఆసక్తి ఉన్న వారు బుధవారం 8గంటల లోగా 9441406252 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

## పూర్వ విద్యార్థినులకు సత్కారం



విద్యార్థినులను సన్మానిస్తున్న సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ నర్సయ్య

సిరికొండ, జూన్ 4 : ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి న సత్యశోధక్ పూర్వ విద్యార్థినులు బి. శ్రీనిధి, ఎస్.స్నేహితరెడ్డిను సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ నర్సయ్య మంగళవారం సన్మానించారు. ఉన్నత లక్ష్యంతోపాటు కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం, దృఢసంకల్పంతో విద్యాభ్యాసం చేస్తే గొప్ప స్థాయికి చేరవచ్చన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించి తల్లిదండ్రులకు, పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థినుల తల్లిదండ్రులు సురేందర్, నరేశ్, ఉపాధ్యాయులు గంగారెడ్డి, రాజు పాల్గొన్నారు.

# దంచికొట్టిన వాన

ఇందల్వాయి/ ధర్పల్లి/ ఇందల్వాయి/ ఆర్మూర్ టౌన్/నవీపేట్, జూన్ 4: జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఇందల్వాయి మండల కేంద్రంలో ఈదురుగాలులతో కూడిన వర్షానికి జాతీయ రహదారి, కమాన్, ఆర్టీసీ బస్టాండ్ వద్ద నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి.

ధర్పల్లి మండల కేంద్రంలో వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వారం రోజుల ముందుగానే రుతుపవనాలు రాష్ట్రానికి చేరుకొని వర్షాలు కురుస్తుండడంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆర్మూర్ పట్టణంలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం కురిసింది. పలు ప్రధాన కూడళ్ల వద్ద చిరు వ్యాపారులు వర్షం కురవడంతో ఇబ్బందులకు గురయ్యారు.

**తాటిచెట్టుపై పిడుగు**

సిరికొండ మండలంలోని గడ్కోల్ గ్రామం తాళ్ల రామడ్గు వద్ద ఓ తాటిచెట్టుపై పిడుగు పడింది. దీంతో మంటలు చెలరేగి ఆకులు దగ్ధమయ్యాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఎలాంటి ప్రమాదం సంభవించకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

**పిడుగుపాటుకు ఆవుమృతి**

నవీపేట మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో పిడుగు పడి ఆవు మృతి చెందింది. గ్రామంలోని జంగం రాజేశ్వర్‌కు చెందిన ఆవు మేత కోసం గ్రామ శివారులోకి తీసుకెళ్లగా పిడుగు పడింది. మృతిచెందిన ఆవు ఖరీదు రూ. 30 వేల వరకు ఉంటుందని యాజమాని తెలిపాడు.



44వ నంబర్ జాతీయ రహదారి ఇందల్వాయి కమాన్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



వర్షంతో జలమయమైన ధర్పల్లి రోడ్డు



ఆర్మూర్‌లో కురుస్తున్న వర్షం

# ముందుకు సాగని మరమ్మతులు

- అమ్మ ఆదర్శ పాఠశాలలపై పాలకుల నిర్లక్ష్యం
- పాఠశాలల పునః ప్రారంభం నాటికైనా పనులు పూర్తయ్యేనా?



కందకుర్తిలో స్లాబ్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి వాజిద్‌హుస్సేన్ (ఫైల్)

రెంజల్, జూన్ 4: ప్రభుత్వం సౌకర్యాలు కల్పించేందుకు ఎంపిక చేసిన అమ్మ ఆదర్శ పాఠశాలలపై పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ పాఠశాలల్లో చేపట్టాల్సిన మరమ్మతులు నత్తనడకన సాగుతున్నాయి. వేసవి సెలవులు ముగిసేలోగా పనులు పూర్తవుతాయో లేదోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతునారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద రెంజల్ మండలంలోని 18 జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్‌లో ఎంపిక చేసింది. ఎంపిక చేసిన పాఠశాలల్లో గదుల మైనర్, మేజర్ రిపేర్ పనులను గడువులోగా చేపట్టేందుకు రూ.74 లక్షల 10వేలు మంజూరయ్యాయి. ఈ పనులకు ముందుగా 10 శాతం నిధులను హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ చైర్మన్ల జాయింట్ బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. మరమ్మతు పనుల పర్యవేక్షణ బాధ్యతను హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ చైర్మన్లకు ప్రభుత్వం అప్పగించింది. పాఠశాలల్లో అవసరమైన మరమ్మతులు, బాలురు, బాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, విద్యుత్ కనెక్షన్ తదితర పనులను సకాలంలో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఉన్నత అధికారులు లక్ష్యం విధించారు. ముందుగా తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు నిర్మించాలని ఇటీవల పనులను పరిశీలించిన అధికారులు గుత్తేదార్లను ఆదేశించారు. మండలంలో కొన్ని పాఠశాల్లో ఇసుక కొరత కారణంగా, మరికొన్ని పాఠశాలల్లో పర్యవేక్షణ లేక పనులు నిలిచిపోయాయి. మరి కొన్ని పాఠశాలల్లో నేటికీ పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వచ్చి క్షేత్ర స్థాయిలో పాఠశాలలను పరిశీలించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఈనెల 12న పాఠశాలు పునః ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అప్పటి లోగా పనులు పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థుల తల్లిడండ్రులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు వేగంగా పూర్తి చేయించాలని కోరుతున్నారు.

## మానవత్వం చాటిన మానిక్‌బండార్ గ్రామస్తులు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

మాక్లూర్, జూన్ 4: మండలంలోని మానిక్‌బండార్ గ్రామానికి పొట్టకూటి కోసం వలస వచ్చిన ఓ కుటుంబం రోడ్డు పక్కన సీసా కమ్మరి వృత్తి చేసుకుంటూ జీవిస్తున్నది. ఈ కుటుంబానికి చెందిన వీరేశం (55) మంగళవారం మృతి చెందాడు. వారి ఆర్థిక పరిస్థితి గమనించి గ్రామస్తులు, యువకులు ఒక్కొక్కరు రూ.500 నుంచి రూ.1000 వరకు విరాళాలు అందజేశారు. ఈ డబ్బులతో అంత్యక్రియలు నిర్వహించారు.

## బీజేపీ నాయకుల సంబురాలు

బోధన్/భీమ్‌గల్/బోధన్ రూరల్/ నవీపేట/ రెంజల్/ధర్పల్లి/ సిరికొండ/ ఇందల్వాయి, జూన్ 4: బీజేపీ విజయం సాధించినందుకు, నిజామాబాద్ ఎంపీగా ధర్మపురి అర్వింద్ మరోమారు గెలుపొందడంపై ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తంచేశాయి. ఈ మేరకు జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం సంబురాలు చేసుకొన్నారు. బోధన్‌లోని పాత బస్టాండ్ వద్ద బీజేపీ నాయకులు పటాకులు కాల్చి, మిఠాయిలు తినిపించుకొన్నారు. భీమ్‌గల్‌లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బోధన్ మండలంలోని ఎరాజ్‌పల్లి గ్రామంలో పటాకులు కాల్చి మోదీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. నవీపేటలోని ప్రధాన చౌరస్తాలో బీజేపీ శ్రేణులు పటాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. రెంజల్ మండలంలోని సాటాపూర్ తెలంగాణ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు సంబురాలు చేసుకొన్నారు. ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయిలో పటాకులు కాల్చి మిఠాయిలు పంపిణీ చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

**రుద్రూర్, చందూర్‌లో కాంగ్రెస్ నాయకులు..**

రుద్రూర్/ చందూర్, జూన్ 4: జహీరాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ ఘన విజయం సాధించడంపై ఆ పార్టీ శ్రేణులు సంతోషం వ్యక్తంచేశాయి. ఈ మేరకు రుద్రూర్, చందూర్ మండల కేంద్రాల్లో పటాకులు కాల్చి సంబురాలు చేసుకొన్నారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు.

**టీడీపీఆధ్వర్యంలో..**

ఖలీల్‌వాడి, జూన్ 4 : ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి భారీ విజయం సాధించడంపై ఆ పార్టీ అర్బన్ అధ్యక్షుడు అంబిక సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సంబురాలు చేసుకొన్నారు.



సాటాపూర్‌లో స్వీట్లు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు

# ప్రైవేట్ దవాఖానల్లో తనిఖీలు



బోధన్ పట్టణంలోని ఓ స్కానింగ్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న వైద్యబృందం



వర్నిలోని ఓ మెడికల్ షాపులో తనిఖీలు చేస్తున్న వైద్యబృందం

శక్కర్‌నగర్/వర్ని, జూన్ 4: బోధన్ డివిజన్‌లోని పలు మండలాల్లోని ప్రైవేట్ దవాఖానలు, మెడికల్ షాపులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లలో వైద్యాధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. బోధన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య నేతృత్వంలో బోధన్ పట్టణంలోని స్కానింగ్ సెంటర్లతోపాటు డివిజన్‌లోని పీహెచ్‌సీ పరిధిల్లోని గ్రామాల వారీగా నిర్వహిస్తున్న ప్రైవేట్ దవాఖానాల్లో తనిఖీలు చేపట్టారు. ఇందుకోసం మొత్తం 12 బృందాలను ఏర్పాటు చేసి, ఆర్‌ఎంపీలు, పీఎంపీలతో పాటు ఆయా గ్రామాల్లో ఉన్న ల్యాబ్‌లలో తనిఖీలు నిర్వహించి వారి వద్దనుంచి ఆధారాలు సేకరిస్తున్నారు. నిబంధనల మేరకు పీఎంపీలు, ఆర్‌ఎంపీలు డీఎంహెచ్‌వో నుంచి పొందిన సర్టిఫికేట్‌తోపాటు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని, మిగతా కేసులను ప్రభుత్వ దవాఖానలకు సూచించాల్సి ఉంటుందని వైద్యాధికారులు వెల్లడించారు. మంగళవారం బోధన్ పట్టణంలో నిర్వహించిన తనిఖీలో పాన్‌గల్లీ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విద్య, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ నిర్మల, ఆరోగ్య విస్తరణాధికారి రవి ఉన్నారు. వర్నిలోని పలు ప్రైవేట్ దవాఖానలు, మెడికల్ షాపులు, ల్యాబ్‌ల్లో మండల పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారిణి కృష్ణవేణి అధ్వర్యంలో తనిఖీలు కొనసాగాయి. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ.. కొన్ని దవాఖానల్లో ధ్రువీకరణ పత్రాలు లేకుండానే వైద్యం చేస్తున్నారని తెలిపారు. ఫార్మాసిస్టు లేకుండా వైద్య పరీక్షలు చేస్తున్నారని, దవాఖానల నిర్వహణలో ఎన్నో లోపాలు ఉన్నాయని వివరించారు. ఇందుకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. తనిఖీల్లో సూపర్‌వైజర్ సావిత్రి, ఆశ కార్యకర్తలు జ్యోతి, రాధ, నాగమణి తదితరులు ఉన్నారు.

**తనిఖీల్లో పూర్తి వివరాలు సేకరిస్తున్నారా?**

జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న తనిఖీల్లో పూర్తి వివరాలు పొందుపరుస్తున్నారా? లేదా అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీల్లో పలువురు కనీస విద్యార్హతలు కూడా లేవని, కొంతమంది ఆర్‌ఎంపీల పేర భూతవైద్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీటిని అరికట్టేందుకు వైద్యశాఖ అధికారులు ముందుగా సమాచారం సేకరించి, తనిఖీలు చేయాలని పలువురు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**WANTED TEACHERS**

★**Wanted Teachers** to teach English, Maths, Physics, Biology and Social Note: Wanted Lady Accountant Little Hearts High School, Namdevwada, Nizamabad. Cont: 9948712344, 9666020695
**NTZ-324927**

**WANTED**

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
**NT-327729-All**

**CHANGE OF NAME**

★I, **BURUGU NAGAMADHAVA SAI, S/o. BURUGU NARSAIAH** (New Name), previously called **BADUGU NAGAMADHAVA SAI, S/o. BADUGU NARSAIAH** (Old Name), R/o. H.No. 9-56/4B, Near Canara Bank, Bank Colony, Varni (V&M), Dist. Nizamabad, T.S., India. and solemnly declare.
**NTW-00**

**CHANGE OF NAME**

★**I, GHOUSIYA BEGUM W/o.ABDUL SAMEE,** H.No.1-3-32, Husnabad street, Armoor, (D) Nizamabad Changed my name as **GHOUSIYA SULTANA**
NTZ-324887

**CHANGE OF NAME**

★I, **SOLLA GANGADHAR S/o. GANGARAM SOLLA** R/o.H.No.1-10/2, Bejjora, Mdl. Bheemgal, Dist. Nizamabad Changed my name as **SULLA GANGA DHAR S/o. NADPI GANGARAM**
NTZ-324888

**CHANGE OF NAME**

★I, **BURUGU MANASA, D/o. BURUGU NARSAIAH** (New Name), previously called **BADUGU MANASA, D/o. BADUGU NARSAIAH** (Old Name), R/o. H.No. 9-56/4B, Near Canara Bank, Bank Colony, Varni (V&M), Dist. Nizamabad, T.S., India. and solemnly declare.
**NTW-00**

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
GST వర్తించును
సెల్ : 91827 77590

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.